# ప్రహ్లాదుని గుణగణములు

## నిర్జర దొడ్ల

మానవునికి జీవితములో కావలసినది ధర్మము, అర్థము, మఱియు కామము - ఈ మూడే అని నమ్మిన వాడు ప్రహ్లాదుని తండ్రి. తన ప్రజలను రక్షించి ధర్మాన్ని ఎంతగా పాలించినను, తన తోబుట్టువులను, సంతానమును ఎంతగా ప్రేమించినను - ఈ గుణములన్నీ మానసిక క్షోభ నుండి శక్తిమంతుడైన ప్రహ్లాదుని తండ్రిని రక్షింపలేదు. తన జీవితాన్ని రాక్షసత్వంలోనే గడిపాడు. జీవితములో నిజమైన ఆనందమును చూడలేక పోయాడు. మోక్ష మార్గమే స్వేచ్ఛామార్గము. ఆ మార్గంలో నీవు-నేను అను భేదభావము తొలగి, అందరియందు సమముగా ప్రవర్తించెదరు. అట్టి ఉన్నత గుణములు ప్రహ్లాదుని యందు పోతనగారు ఇలా వర్ణించారు:

తనయందు నఖిలభూతములందు నొకభంగి సమహితత్వంబున జరుగువాఁడు
పెద్దలఁ బొడగన్న భృత్యుని కై వడిఁ జేరి నమస్కృతుల్ సేయువాఁడు
కన్నుదోయికి నన్యకాంత లడ్డంబైన మాతృభావన సేసి మరలువాడు
తల్లిదండ్రులభంగి ధర్మవత్సలతను దీనులఁ గావఁ జింతించువాఁడు

సఖులయెడ సోదరస్థితి జరుపువాఁడు / దైవతములంచు గురువులఁ దలఁచువాడు
లీలలందును బొంకులు లేనివాడు / లలిత మర్యాదుఁడైన ప్రహ్లాదుఁ డధిప (7.115)

మానవులేకాదు, సమస్త జీవకోటిని తనతో సమానముగా భావించుట, పెద్దలయందు వినయముగా ప్రవర్తించుట, ఇతర స్త్రీలను తల్లిభావనతో చూచుట, కష్టములలో నున్నవారిని తన తల్లిదండ్రులవలె ఆదరించుట, స్నేహితులను అన్నదమ్ములవలె చూచుట, గురువులను దైవసమానులుగా గౌరవించుట, ఆటపట్టుకైనా అబద్ధాలు చెప్పకుండుట ఈ గుణములు కలిగిన వాడు, లలిత మర్యాదుడు ప్రహ్లాదుడు. ఈ పద్యములో మాతృవాత్సల్యము, పితృవాత్సల్యము ల వలె పోతనగారు "ధర్మవత్సలత" అనే పదమును వాడుట విశేషము.